www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

వాణిజ్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY
తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :35 | 14-06-2021 | పుటలు : 4


## ఆచార్య జగన్నాథరావు

# సేవలు విశేషమైనవి

### - ఏ.యు. విసి,ఆచార్యులు,పరిశోధకులు.



జగన్నాథరావును సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు



విద్యార్థి దశ నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అనుబంధాన్ని ఏర్పరచుకొని, 35 సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో విశేష సేవలందించారు.

**'శ్రమయేవ జయతే' మూడున్నర దశాబ్దాలపాటు విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని భూగర్భ శాస్త్ర విభాగానికి విశేషమైన సేవలు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య జగన్నాథరావు అని ఆంధ్ర విశ్వవిద్యాలయం కొనియాడింది.రిటైర్ అయినప్పటికీ వారి సేవలు యూనివర్సిటీకి అవసరమని,నన్నయ విశ్వవిద్యాలయాభివృద్ధికి వారి కృషి అభినందనీయమని పలువురు కొనియాడారు.**

## మీ సేవలు కొనసాగాలి

15 సంవత్సరాల క్రితం విశ్వవిద్యాలయ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎఫైర్స్ లో బాధ్యతలు నిర్వహించి ఆ విభాగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు. డైరెక్టర్ ఫర్ డెల్టా స్టడీస్ మంచి సేవలందించారు. విద్యా, పరిశోధనలకు ప్రాధన్యతనిచ్చే వారు. ఆయన పర్యవేక్షణలో పరిశోధనలు చేసిన విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ బోధన వృత్తిలోను, పరిపాలన నైపుణ్యంలోను ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నారని భావిస్తున్నాను. ఇది నా అభిప్రాయం మాత్రమే కాదు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారుల అభిప్రాయం కూడా. ఉద్యోగ విరమణ అయిన తరువాత కూడా ఆంధ్రవిశ్వవిద్యాలయానికి మీ సేవలు అవసరం. నూతన ఉత్సాహంతో విద్యపరమైన అంశాల్లోను, పరిశోధనలలోను, ప్రోజెక్టులలోను మీ సహకారం ఆంధ్రవిశ్వవిద్యాలయానికి కావాలి. మీ విజ్ఞానం తరువాత తరం విద్యార్థులకు అందాలని మేము ఆశిస్తున్నాం

**- ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి, ఉపకులపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం.**

## బాధ్యతాయుతంగా సేవలందిస్తారు



ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు ఆంధ్ర యూనివర్సిటీలో భూగర్భ శాస్త్ర విభాగంలో ఆధ్యాపకునిగా, పరిశోధకునిగా సుమారు మూడున్నర దశాబ్ధాలు పైగా వారు సేవలు నిరంతరాయంగా అందించి దిగ్విజయంగా పదవి విరమణ చేయు సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు. జగన్నాథరావుగారు విజ్ఞానగని. వారికి ఉన్న ప్రతిభ, కుశలత, దక్షత, సామర్థ్యలతో విభాగాధిపతిగా, చైర్మన్ గా, పరీక్ష విభాగ డీన్ వంటి పదవులకు ఔనత్యాన్ని ఇనుమడింపచేసారు. విద్యార్థుల అభివృద్ధికి ఈయన చిత్తశుద్ధితో బాధ్యతయుతంగా పని చేసే వారని నిస్సందేహంగా పేర్కొనవచ్చు. బోధన వృత్తి పట్ల అభిరుచి, ఉత్సహంతో పాటుగా అంకిత భావంతో బోధించే వారని విద్యార్థులు కొనియాడేవారు. ఆంధ్ర యూనివర్సిటీ నందు విద్యార్థుల శ్రేయస్సు కొరకు నిర్విరామంగా కృషి చేసిన వారిలో ఒకరిగా గుర్తింపు ఉంది. ఆచార్య జగన్నాథరావుగారి అధ్యాపక వృత్తి నైపుణ్యం పరిశోధనలో ఉన్న విశేషానుభవం, కార్యదీక్షత మొదలైన అంశాలను పరిగణలో తీసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియామకం చేయుట జరిగింది. వీరి ప్రత్యేక శైలి, విద్యా రంగంలో ఉన్న అపార అనుభవం నన్నయ యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పుటకు సందేహం లేదు. మహోన్నత వ్యక్తిత్వం ద్వారా వారిపై ఉంచిన పదవీ బాధ్యతను దిగ్విజయంగా, విజయపథంగా నడిపించి ఆదికవి నన్నయ పేరు ప్రతిష్టలు ఇనుమడింప చేస్తారని తద్వారా ఆంధ్ర యూనివర్సిటీ విశిష్ట వ్యక్తిగా ప్రచుర్యం పొంది భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు గైకొని విద్యారంగ అభివృద్ధికి తొర్పడతారని ఆశిస్తున్నాం.

**- ఆచార్య వడ్డాది కృష్ణమోహన్, రిజిస్ట్రార్,ఆంధ్ర విశ్వవిద్యాలయం.**

## పరిశోధనలలో ప్రావీణ్యుడు



30 సంవత్సరాలకు పైగా జగన్నాథ రావుతో పరిచయం ఉంది. మంచి వ్యక్తిత్వంతో, సౌమ్యునిగా నలు గురికి మంచి చేయాలనే ఉన్నత ఆలోచనలతో ఉంటారు. విద్యా బోధన మాత్రమే కాకుండా పరిశోధనలకు అధిక ప్రాధన్యతనిస్తారు. వారి పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపును సంపాదించు కున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ డీన్ గా వారు పనిచేసిన కాలంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ అఫైర్స్ విభాగానికి మంచి గుర్తింపు వచ్చింది. ఎం.టెక్. పాఠ్యాంశాలను తయారు చేయడం, ఓ.ఎన్.జీ.సి. నుండి ప్రాజెక్టులను తీసుకురావడం వంటి విద్యా, పరిశోధన, పరిపాలన అంశాలలో ఉత్సాహంతో పాల్గొనే వారు. నాక్ స్టాండింగ్ కమిటీ మెంబర్ గా విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు సాధించడంలోను, ఐ.ఎస్.ఓ. గుర్తింపు సాధించడంలో భాగస్వామ్యమయ్యారు. జాతీయ అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలను కుదర్చడంలో జగన్నాథరావుకు ప్రత్యేత స్థానం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, పరిశోధకులుగా, పరిపాలకునిగా విశేష సేవలందించారు. నన్నయ విశ్వవిద్యాలయాన్ని వారి ప్రతిభతో ప్రగతి పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నాం.

**ఆచార్య కె.శ్రీనివాసరావు,**
**ప్రిన్సిపాల్, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,ఆంధ్ర విశ్వవిద్యాలయం.**

## విద్యార్థుల ఉన్నతియే జగన్నాథరావు లక్ష్యం



ఆచార్య జగన్నాథ రావుతో కలిసి ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని జియాలజీ విభాగంలో మూడు దశాబ్ధాలుగా పని చేయడం చాలా ఆనందంగా ఉంది. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తారు. వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు.విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా భావించి వారికి మార్గనిర్దేశం చేస్తారు. ఆయన విద్యావేత్త మాత్రమే కాదు, మంచి పరిపాలకుడు కూడా. జగన్నాథరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న అన్ని పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ఆయనకు ఉన్న ప్రతిభతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమితులయ్యారు. వారు సంతోషకర మైన, ఆరోగ్యకరమైన మరియు శాంతియుత పర్యవేక్షణను పరిపాలనను అందిస్తారని కోరుతున్నాను. వారి విజ్ఞానపంమైన ఆలోచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయి. పదవీ విరమణ అనంతరం కూడా వారి సేవలు విద్యా వేత్తలకు, సమాజానికి అందుతాయని కోరుకుంటున్నాను.

**-ఆచార్య ఈ.ఎన్.ధనంజయ రావు,**
**డీన్ - ఇంటర్నేషనల్ అఫైర్స్,ఆంధ్ర విశ్వవిద్యాలయం.**
**పూర్వ రిజిస్ట్రార్ మరియు ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్,ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**


## జియాలజీ విభాగం నుంచి వీసీగా ఎదగడం హర్షణీయం



జగన్నాథరావుగారితో కలిసి పని చేయడం చాలా సంతోషం. సీనియర్ ఆచార్యులుగా జియాలజీ విభాగంలో విశేషమైన సేవలం దించారు. విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ వారి ఉన్నతికి పాటుపడడం ఆయన ప్రత్యేకత. జియాలజీ విభాగంలో జగన్నాథరావు విద్యా, పరిశోధన ప్రగతికి మరియు ప్రోజెక్టులు తీసుకురావడానికి కృషి చేసారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డెల్టా స్టడీస్ డైరెక్టర్, డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎఫైర్స్, డీన్ పీజీ ఎగ్జామ్స్ వంటి కీలకమైన పదవులను ఆయన అధిరోహించి సమర్థవంతమైన సేవలందించారు. జియాలజీ విభాగం నుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారిని నియమించడం చాలా హర్షణీయం. వారి విజ్ఞాన సామర్థ్యాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్తిగా సద్వినియోగం చేసుకుంటుందని భావిస్తున్నాను.

**ఆచార్య కె.ఎస్.ఎన్. రెడ్డి,**
**జియాలజీ విభాగాధిపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం.**

## సంపాదకీయం



# ధర్మచక్రం

'ధరతి విశ్వమితి ధర్మః' ప్రపంచాన్ని ధరించేది ధర్మమని అర్థం.ధారణాద్ధర్మ ఇత్యాహు: సమస్తానికి ఆధారమైనదని. ధర్మం నిలబడి ఉంటేనే సమస్త ప్రపంచం నిలబడి ఉంటుంది. ధర్మం నశిస్తే ఆధారం లేనిది ఎలా పడిపోవడం సహజమో ప్రపంచం కూడా అలాగే పతనమవుతోంది. ప్రతి నిత్యం ప్రపంచంలో హృదయ విదారకమైన సంఘటనలు చూస్తున్నాం. దీనికి కారణం ధర్మం లోపించటమే.'ధర్మ ఏవ హతోహన్తి' ధర్మాన్ని చంపితే వచ్చే ఇబ్బందులు ఇవి. విశ్వాధారమైన ధర్మం నశిస్తే జరిగేది పతనం. అన్ని చోట్లా, అన్ని విషయాల్లో ధర్మం అవసరం. మానవీయ ధర్మముంటే 'మనిషి' అవుతాడు.అది పోతే పశువుగా మారుతాడు.

ధర్మం నశిస్తే ప్రళయం వస్తుందని,సర్వ నాశనమవుతుందని, వినాశనం కలుగుతుందని ప్రపంచ యుద్ధాలు ఏనాడో తెలియజేశాయి. అందుకని ఈ లోకానికి ధర్మాన్ని రక్షించడమే నిత్య కర్తవ్యం కావాలి. ధర్మానికి పది లక్షణాలున్నాయి.. "ధైర్యం, ఓర్పు, అంతరింద్రియ నిగ్రహం, నిస్వార్థం,శుచి, బహిరింద్రియనిగ్రహం, బుద్ధి, విద్య, సత్యం, క్రోధం లేకపోవటం".... వీటితో ధర్మం రక్షించబడుతుంది.

ధర్మంచర... అనే వాక్యం 'ధర్మాన్ని ఆచరించుమని' లోకాన్ని శాసిస్తోంది. ధర్మాన్న ప్రమదితవ్యం... అంటే ధర్మం విషయంలో ఏమాత్రం ఏమరుపాటు తగదని శిక్షావల్లి శిక్షణను ఇస్తుంది.శిక్షణను బట్టే ఫలితం కదా!!

నీవు చెప్పింది ధర్మ సమ్మతం కాదు.. ఇక్కడ ధర్మ శబ్దానికి 'న్యాయం' అని అర్థం.

ధర్మం చెయ్యండి... ఇక్కడ 'దానం' అని అర్థం.

నీవు ధర్మం పలకలేదు... ఇక్కడ 'సత్యం' అని అర్థం.

అది జీవన ధర్మం... అంటే

'స్వభావం'అని అర్థం. ధర్మకార్యాలు చేస్తే సద్గతి కలుగుతుంది.. 'పుణ్య'మని అర్థం. ఇలా ధర్మ శబ్దం... న్యాయం,దానం, సత్యం, స్వభావం,పుణ్యం... వంటి అనేక అర్థాలను ఇస్తుంది. ధర్మం అని దేనినైతే అంటున్నామో అదే ధార్మికం. ధార్మిక జీవన విధానమే ప్రపంచ శాంతి మార్గం. ధర్మం సర్వజన సమ్మతమైంది. అనేకంలో ఏకత్వాన్ని చూడగల సామర్థ్యం ధర్మానికి ఉంది. అటువంటి ధార్మిక జీవనమే విశ్వధర్మానికి ఆధారం. విశ్వ కల్యాణానికి మార్గం! విశ్వశాంతికి ప్రాణం!!

# ఆన్‌లైన్ తరగతుల గురించి విద్యాశాఖ సమీక్ష

### ఆన్లైన్ క్లాసులను మరింత సమర్థవంతంగా నిర్వహించండి

### స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఐ.ఎ.ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సతీష్ చంద్ర

**09.06.21** (మీడియాసెల్) కోవిడ్ వంటి విపత్కర సమయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న విద్యాపరమైన ప్రగతి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంతృప్తిని వ్యక్తం చేసి విశ్వవిద్యాలయ అధికారులను, అధ్యాపకులను ప్రశంసించారు. ఆన్లైన్ క్లాసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఐ.ఏ.ఎస్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అధికారులు మరియు అధ్యాపకులతో ఆన్లైన్ ఫ్యాకల్టీ రివ్యూ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా శాఖ నిర్వహించింది. దీనిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఐ.ఏ.ఎస్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి కోవిడ్ సమయంలో నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న విద్యాపరమైన అంశాలపై వీసీ ఆచార్య మొక్క జగన్నాథరావును అడిగి తెలుసుకున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్లోని ఆయా విభాగాల అధ్యాపకులతో వ్యక్తిగతంగా మాట్లాడి ఆన్లైన్ క్లాసుల నిర్వహణపై ఆరా తీశారు. ఆన్లైన్ క్లాసులు, వెబినార్లు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలు, పరిశోధనలు, విద్యాపరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఆన్లైన్ క్లాసులు తప్పనిసరిగా నిర్వహించాలని తెలియజేశారు. విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో ఆన్లైన్ క్లాసులకు హాజరయ్యే విధంగా ఆయా తరగతుల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలోని అన్ని కళాశాలలు ఆన్లైన్ క్లాసులు తప్పనిసరిగా నిర్వహించే విధంగా విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఆన్లైన్ క్లాసులు నిర్వహించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయ అధికారులకు ఆదేశించారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుందని, విద్యాపరమైన పథకాల అమలును పూర్తి స్థాయిలో అమలు చేసిందని అన్నారు. దానికి తగిన విధంగా విశ్వవిద్యాలయాల నుండి అధ్యాపకుల నుండి విద్యాపరమైన ఫలితాలను ఆశిస్తున్నామని చెప్పారు. వెబినార్లు, ఆన్లైన్ తరగతులు లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ అమలు వంటి అంశాలలో విశ్వవిద్యాలయం ప్రత్యేకతను సంపాదించుకుందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాపరమైన ప్రగతిని పర్యవేక్షిస్తున్నామని వీసీ, రిజిస్ట్రార్ మరియు ఆచార్యుల కృషిని అభినందించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ ల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో పట్టు సాధించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

**11.06.21** (మీడియాసెల్) బిజినెస్ ఇంటెలిజెన్స్ లో విద్యార్థులు పట్టు సాధించాలని మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'బిజినెస్ ఇంటిలిజెన్స్ యాజ్ ఎ సర్వీస్ – కీ ఎనాబ్లర్ ఇన్ డ్రైవింగ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్' అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. ఈ సదస్సులో వి.సి.మాట్లాడుతూ కంపెనీలలో బిజినెస్ ఇంటిలిజెంట్ కీలక పాత్ర పోషిస్తున్నాయని విద్యార్థులు దానికి సంబంధించిన టూల్స్ పై పట్టుసాధించి ఉన్నత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సేవగా ఈ సాంకేతికత ఖర్చును తగ్గించడంలో మరియు వనరులను ఆప్టిమైజ్ చేయడంలో చాలా సహాయపడుతుందని తెలిపారు. రిసోర్స్ పర్సన్ కె.పి.ఎం.జి. సీనియర్ కన్సల్టెంట్ వై.వి.సునీల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెద్ద సంస్థల నుండి చిన్న కంపెనీల వరకు, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో బిజినెస్ ఇంటెలిజెన్స్ కీలకమైనదిగా మారిందన్నారు. నేటి రిమోట్ పని విధానం కారణంగా, సమీప భవిష్యత్తులో బిజినెస్ ఇంటెలిజెన్స్ సేవలకు డిమాండ్ పెరుగుతుందని మరియు విద్యార్థులు డేటా సైన్స్ పై వారి జ్ఞానాన్ని సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# విద్యార్థి లోకం

## ప్రతిభా వాణి

## శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

**(17జూన్ 1889 - 10 జూన్1928)**



ఆంధ్ర రత్న బిరుదాంకితులు, స్వాతంత్ర సమరయోధులు, నిస్వార్ధ దేశభక్తులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో జన్మించారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులు మరణించడంతో పిన తండ్రి గారి పెంపకంలో పెరిగారు. బాపట్లలోని తాలూకా కచేరీలో గుమస్తాగా పనిచేశారు. గుంటూరులో చదువుకున్నారు. విద్యార్థి దశలోనే అరవింద ఘోష్, లోకమాన్య తిలక్ ప్రభావం ఆయన మీద ఉంది. స్నేహితుడు నడింపల్లి నరసింహారావు సహాయంతో ఉన్నత చదువులకు ఇంగ్లాండ్ వెళ్లి ఎడింబరో విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఏ.పట్టా పొంది స్వదేశం తిరిగి వచ్చారు.అనేకమైన జానపద కళల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. 1917లో రాజమండ్రి ట్రైనింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. తర్వాత బందరులోని జాతీయ కళాశాలలో పనిచేసే రోజుల్లో కృష్ణా పత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి పెద్దలతో పరిచయమైంది. స్వతంత్ర భావాలు గల దుగ్గిరాలకు ఉద్యోగాలేవీ నచ్చక చీరాల పేరాల సమీపంలో శ్రీమదాంధ్ర విద్యాపీఠ గోష్ఠి పేరిట ఒక విద్యా సంస్థను నెలకొల్పారు. గాంధీజీ పిలుపునందుకుని జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తెలుగునాట గ్రామ గ్రామాన జాతీయ ఉద్యమ ప్రచారం చేపట్టారు. 'రామదండు' పేరిట ఒక స్వచ్ఛంద సేవా దళాన్ని ఏర్పాటు చేశారు. క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి,త్యాగదీక్ష, ఆధ్యాత్మికత రామదండు వాలంటీర్లకు ఉండవలసిన ప్రధాన లక్షణాలుగా నిర్ణయించారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వం చీరాల పేరాలలను కలిపి ఒక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గోపాలకృష్ణ గారు నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరు. పూరి గుడిసెలు వేసుకొని ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేసేలా దుగ్గిరాల ఉద్యమం నిర్వహించారు. కొంతకాలం 'సాధన' అనే ఆంగ్ల పత్రికను నిర్వహించారు. గ్రంథాలయాల వ్యాప్తికి, ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి, అస్పృశ్యతా నివారణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి.

గొప్ప పండితుడు, కవి, గాయకుడు, విమర్శకుడు, సర్వమతాలు సమానం అని చాటిన మహా ప్రవక్తగా కీర్తింపబడ్డారు. 40 ఏళ్ల పిన్న వయసులోనే తుదిశ్వాస విడిచిన శ్రీ దుగ్గిరాల ప్రతిభాశాలిగా కీర్తిగడించారు. ఆయన సేవాభావం ఆదర్శ ప్రాయమైనది. తెలుగు వారు ఆయనను "ఆంధ్రరత్న" బిరుదుతో సత్కరించి గౌరవించుకున్నారు.

**ఆ మహనీయునకు నన్నయవాణి అక్షర నీరాజనం సమర్పిస్తోంది.**

# సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోండి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**07.06.21 (మీడియాసెల్)** ఇంజనీరింగ్ విద్యార్థులు నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో "వీకెండ్ వినియోగ్" అనే కార్యక్రమాన్ని వీసీ ఆన్లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లోని ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు వీకెండ్ వినియోగ్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. దీనికి కన్వీనర్ గా ప్రిన్సిపాల్ డా. వి. పెర్సిస్ వ్యవహరిస్తున్నారని అన్నారు. వీకెండ్ వినియోగ్ కార్యక్రమంలో సాఫ్ట్వేర్ ఇండస్ట్రీస్ కి చెందిన ప్రముఖుల ఉపన్యాసాలు, ఆచరణాత్మక అంశాలను వివరిస్తారని తెలిపారు. దీనిని ఆన్లైన్ ద్వారా ఉచితంగా విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ గా జిక్సిపియర్ సొల్యూషన్ బెంగళూరు టీం లీడర్ ఎన్. ఆదిత్య సుందర్ 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' లోని ఉద్యోగ అవకాశాలు, ఇంటర్న్షిప్ తదితర అంశాలను వివరించారు. కన్వీనర్ డా. వి. పెర్సిస్ మాట్లాడుతూ వీకెండ్ వినియోగ్ కార్యక్రమం ప్రతి శని లేదా ఆదివారాల్లో ఆన్లైన్ ద్వారా జరుగుతుందని, ఇంజనీరింగ్ విద్యార్థులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఆర్గనైజర్స్ టి. శ్రీహరికృష్ణ, కె శ్రీకాంత్, జి.అపర్ణదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ


# నాక్ సాధనకు కృషి చేయండి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




**11.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు కోసం చేస్తున్న ప్రయత్నాలు వేగవంతం చేయాలని నాక్ సాధనకు సమష్టిగా కృషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ నాక్ కమిటీ సభ్యులతో వీసీ ఆన్లైన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపు ఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ నాక్ సాధన కోసం పని చేయాలని అన్నారు. నాక్ ద్వారా అనేక నిధులు సమకుర్చుకొని విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కాబట్టి కొవిడ్ సమయంలో కూడా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కమిటీ సభ్యులు నాక్ మార్గదర్శకాలను అనుసరించి సెవెన్ క్రైటీరియాలకు సంబంధించిన సమాచారాలను సిద్ధం చేసుకొని ఉంచాలని చెప్పారు. సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్.) ద్వారా 70 శాతం మార్కులు వస్తాయని కాబట్టి నాక్ కమిటీ సభ్యులు రిపోర్టుకు కావాల్సిన సమాచారాన్ని చక్కగా ప్రదర్శింపచేయాలని తెలియజేసారు. సమష్టి కృషితో నాక్ గుర్తింపు సాధించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. నాక్ సాధనకు అవసరమైన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేసారు.ఎస్.ఎస్.ఆర్. లో బోధన ప్రమాణాలు, పరిపాలన, పరిశోధనలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి 7 ప్రధాన అంశాలపై జరుగుతున్న పనితీరు పై కమిటీ సభ్యులు ఆన్లైన్లో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాక్ కోఆర్డినేటర్ ఆచార్య కొట్టి శ్రీరమేష్, ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, సభ్యులు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంచి మాట




సమయపాలనే
మనిషి సౌశీల్యానికి
మచ్చుతునక!

- లూయిా చక్రవర్తి

# గిరిజన వైద్య సర్వస్వం

## పుస్తకం




చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి సంహితలు వచ్చి ఉండకపోతే భారతీయులకు ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఆయుర్వేదమనే ఒక వైద్యశాస్త్రం ఉందని తెలిసేది కాదు. గిరిజనుల్లో తరతరాలుగా వేలాది సంవత్సరాలుగా వస్తున్న వైద్య విజ్ఞానాన్ని ఒక సర్వస్వంగా రూపొందించి డాక్టర్ కొప్పుల హేమాద్రిగారు ఇప్పుడు తెలుగు ప్రజలకు తద్వారా ప్రపంచ ప్రజానీకానికి ఈ వైద్య సర్వస్వాన్ని రచించి మహోపకారం చేశారు. వైద్య విజ్ఞానమంతా అనుభవ ప్రాతిపదికన మొదలైనదే. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కలిగిన అనుభవాలు, అనుభూతులు అన్వేషణకు, పరిశోధనకు దారి చూపుతాయి. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన మనిషి తన కష్టాలకు నివారణల్ని కూడా ప్రకృతి నుండే తెలుసుకొన్నాడు. ఆ క్రమంలో జ్ఞానం నుంచి మరింత ఉన్నతి కోసం ముందుకు సాగాడు. కొండల్లో, కోనల్లో పుట్టి అక్కడే జీవనం సాగించే గిరిజనుల వికాసం అంతా ఈ విధంగా జరిగిందే.

ఆధునికంగా జరిగే పరిశోధనలు ప్రయోగశాలల్లో జంతువుల మీద జరుగుతాయి. గిరిజనులు మాత్రం తమ మీదే ప్రయోగించుకుని మందు మొక్కలను కనిపెట్టారు. వాళ్ళు కపటం లేని వారు కనుక వారి దృష్టిలో తనతో సహా అందరి కష్టం ఒకటే. అందుకనే వారి పరిశోధనలు స్వార్ధ ప్రాతిపదికన కాక, వ్యాపార ప్రాతిపదికన కాక కొనసాగాయి. గిరిజనుల్లో ఉండిపోయిన విజ్ఞానం అనంతమైనది. ఈ గ్రంథకర్త ఆ అనంత విజ్ఞానంలో నుంచి వీలైనంత తనకు చేతనైనంత తోడుకొని మన భాషలో మనకు అందించడం, దానితోపాటు ఒక వృక్ష శాస్త్రజ్ఞుడుగా ఆయన గిరిజన వైద్య ప్రయోగాల్లో వచ్చే ప్రతి ఔషధానికి వీలున్నంతవరకూ వృక్ష శాస్త్రంలో ఉన్న ఆధునిక నామాన్ని కూడా స్పష్టంగా చెప్పారు.అది అంత తేలికైన పనికాదు.ఒకే మందు మొక్కను రకరకాల పేర్లతో గిరిజనులు తెలపడాన్ని, ఒకే రకం మొక్కలు కొద్దిపాటి తేడాతో ఉండే భేదాన్ని గమనించి వారు వ్యవహరించడాన్ని ఈ వృక్ష శాస్త్రవేత్త గమనించారు. అందువల్ల ఎంతో విచక్షణతో ఆ మొక్కలకు శాస్త్రం నామాన్ని ఇవ్వటంలో స్పష్టత కోసం తన నలభై ఏళ్ళ అనుభవం వినియోగించుకున్నారు. ఈ రకంగా ఈ గ్రంథం ఒక ఆధునిక రూపాన్ని సంతరించుకుంది. పాల నుంచి పెరుగు నుంచి చిలికి వెన్న తీసి మరిగించి కమ్మటి నెయ్యి సాధించినట్లే హేమాద్రి గారు ఎంతో శ్రమ చేసి ఈ విజ్ఞానాన్ని మనకు అందించారు.

వీటిలో ఉన్న అమూల్యమైన ప్రయోగాలపై ఆధునిక పరిశోధనలు చేయదలచుకున్న వారికి ఎంతో నమ్మదగిన రిసోర్స్ సమకూర్చి పెట్టారు. నిజమైన శాస్త్రవేత్తలు, వ్యాపార ప్రయోజనాన్ని ఆశించి ముందుకు సాగే మహానుభావులు కానీ ఈ సంహితలోని జ్ఞానాన్ని ఎంతైనా ఉపయోగించుకోవచ్చు. తేడా అంతా వారు ఆ పనిని స్వార్ధ రహితంగా లోకహితం కోరి చేస్తున్నారా, స్వార్ధ ప్రయోజనాల కోసమే చేస్తున్నారా అనేది మాత్రమే. ఏది ఏమైనా ప్రయోజన దాయకమైన సంహిత ఈ సమాజానికి అందించారు.

ఆధునిక వైద్యం కానివ్వండి, హోమియో తదితర వైద్య విధానాలు కానివ్వండి, దేశీయమైన ఆయుర్వేద వైద్యం కానివ్వండి, ఏ వైద్య విధానానికి సంబంధించిన వారైనా వారంతా గిరిజనుల వైద్యాన్ని తక్కువగా చూడటం మానుకోవాలి. తమ తమ వైద్య విధానాలు అన్నిటికీ ఏదో ఒక దశలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో గిరిజన వైద్యం ఆలంబన అవసరాలుగా నిలిచాయి. వాటి ఆధారంగా ఆయా విధానాల్లో పరిశోధనలు కొత్త ఆవిష్కరణలు జరిగిన సందర్భాలు అనేకం. గిరిజన వైద్యంలో అనేక ప్రయోగాలు ఇప్పటికీ పైన చెప్పిన విధంగా ఉన్నాయి. జబ్బును నయం చెయ్యని బ్రహ్మాండమైన పరిశోధనాత్మక జ్ఞానం కంటే వెనువెంటనే సత్ఫలితాలను ఇచ్చే అనుభవ జ్ఞానం ఏ విధంగానూ తీసిపోదు. ఎన్నో వేలాది అనుభవాలు ఈ విధంగా జనజీవన చరిత్రలో నమోదు అయ్యాయి. అందుకనే మనమంతా వివిధ రంగాల్లో నిష్ణాతులమైనా, అమాయకులైన ఆ గిరిపుత్రులకు, గిరిపుత్రికలకు చేతులెత్తి దండం పెట్టాలి. వారిని గౌరవించడం నేర్చుకోవాలి. వారి నుంచి నేర్చుకోవడం నేర్చుకోవాలి. తెలుగు జాతి డాక్టర్ హేమాద్రి గారిని చూసి గర్విస్తోంది. ఆయన గిరిజనులకు ఋణపడ్డారా, గిరిజనులే ఆయనకు ఋణ పడవలసిఉందా... అనేది కాలం తేల్చవలసిన సంగతి.ఈ గ్రంథం తెలుగు, ఆంగ్లంతోపాటు అన్ని భారతీయ భాషలలోనికీ రావాల్సిన అవసరం ఉంది.

- డా.సామల రమేష్ బాబు.

# కవితా కాలం

## కరోనా వేళ..
## చిన్నారి చదువు




అక్షరాలు దిద్దిన
పలక బలపాన్ని
మరిచిన చిన్నారి
చరవాణి చేతపట్టి
దిద్దిన అక్షరాలు గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నంలో,
ఒక యంత్రం మరో యంత్రాన్ని
యాంత్రికంగా కూర్చో పెడుతోంది
అర్థమవుతోందా అని అడిగే బోధకుడి ప్రశ్న
వింటున్నావా అంటూ
అజమాయిషీ చేస్తున్న తల్లిదండ్రులు నడుమ
అర్థం లేకపోయినా
తన ముఖకవళికలను చూసి మురిసిపోతోనే,
బోధనాంశాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం,
ఏ పరికరం అయితే ఆడుకోవడానికి
ఆంక్షలు చెప్పేవో,
అదే పరికరం పరిజ్ఞానానికి ఆయుధమైంది
బహుశా ఈ వింత
కళంకిత కరోనాకే సాధ్యమేమో

- బి.భాస్కర రావు,
ప్రకాశం డిగ్రీ కళాశాల.

## బతుకు బడి.

బతుకు బడి... ఎందరో తారస పడతారు..
ఎన్నో... ఎన్నెన్నో అనుభూతులు,
అనుభవాలు అందిస్తుంటారు.
సుఖమయ జీవితాన్ని సరిగంచు
వలువల్లో చుట్టుకొని....
మనోఫలకం పై
అద్భుత చిత్రాలు చిత్రించుకుంటారు.
సంఘం చెక్కిన శిల్పాలుగా,
ఉలి దెబ్బలకు రాటుదేలిన ...
అనుభూతులతో నేర్చిన పాఠాలెన్నో.....
ఎవరి అవసరాలకు వారు బతుకు దారుల్లో...
సుతారంగా హృదయాన్ని మీటినట్లు..
వారి వారి అవసరాలకు
గాయాలు చేస్తున్నారు.
కాలంతో పయనిస్తూ..
కష్టాలను చిరునవ్వుతో ఆహ్వానిస్తే...
వెంటనే సన్మార్గాలు దర్శన మిస్తాయని...
చిద్విలాసంగా జీవనమార్గంలో పయనించాలి.

- పి.రాజేష్,బి.కాం.(ద్వితీయ)


## ఈమె..ఓ ఝాన్సీ రాణి...



ఈమె.. ఓ రాణీ రుద్రమ
కాని ఈమె యుద్ధక్షేత్రంలో లేదు
ఈమె..ఓ ఝాన్సీరాణి
కాని ఈమె స్వాతంత్ర్య రణ క్షేత్రంలో ఉండదు
ఈమె..ఓ కుటుంబ పాలనా సంస్కర్త
కానీ ఈమె ఏ రాజకీయ క్షేత్రంలో కానరాదు
ఈమె..ఓ ధైర్యసాహసాలు గల జవాన్
కానీ..ఈమె దేశ సరిహద్దు క్షేత్రంలో అగుపించదు
ఈమె..ఓ (అ)సాధారణ మహిళ
కాని.. వ్యవసాయ క్షేత్రంలో హలంతో పొలం దున్ని
దేశం ఆకలిని తీర్చే రైతమ్మ
ఓవైపు తన పసిపిల్లాడిని ఆడిస్తూ లాలిస్తూనే
పసిడి పంటల్ని పండించే శ్రమజీవి
మనలాంటి లక్షలాది మందికి స్ఫూర్తిప్రదాత...అన్నదాత

- తోడిశెట్టి పరమేశ్వర్, నిర్మల్

## మానవుడు - దానవుడు




సాధు జంతువు ఏదైనా అది ఒక కొత్త మనిషి వద్దకు వెళ్ళాలంటే భయపడుతుంది. ఆ మనిషి ఆహారం అందిస్తే ముందు సందేహించినా భయంతోనే తీసుకుంటుంది. రోజూ ఆ మనిషి ఆహారం అందిస్తుంటే తనకు ఆహారం అందిస్తున్న మనిషి మంచివాడని తలచి ఆ మనిషికి మచ్చికవుతుంది. ఆ మనిషితోనే ఉంటుంది. ఆ మనిషి మాటే వింటుంది. మొదట్లో ఆ మనిషి దగ్గరకు రావటానికే భయపడినా... ఇప్పుడు తనలో ఆ భయం లేదు. ఆ మనిషి చేతిలో కర్ర ఉన్నా భయం లేదు. కత్తి ఉన్నా భయం లేదు. ఎందుకంటే ఆ మనిషి తనని ఏం చేయడని నమ్మకం. సాధు జంతువు తనని బాగా నమ్మిందని తెలుసుకున్న ఆ మనిషి దాన్ని కసాయి వాడికి అమ్మేస్తాడు. ఆ మనిషి చేసిన మోసానికి సాధు జంతువు బేలగా కబేలాకు వెళ్లి కన్నుమూస్తుంది.

మరొక సాధు జంతువుతో ఆ మనిషి స్నేహం చేయటం మొదలవుతుంది.

ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. జరగదు ఏ ప్రతిక్రియ??

(కబేలాకు తరలిస్తున్న పశుసంపదను చూసి బాధతో...)

- వెంకు సనాతని,బాపట్ల




ఆర్ట్ బై
కె.లవన్ రెడ్డి
ఎమ్.ఏ.ఏకనామిక్స్,అక్ను.

## మన మగధీరుడు..



మన పవిత్ర భరతఖండమందు
జన్మించిన మన భరతమాత ముద్దుబిడ్డ
బాబాసాహెబ్ అంబేద్కర్ గారు
విశ్వ జనుల హృదయాలను గెలుచుకున్న తీరు
అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా
ఎవరూ కూడా మరిచిపోరు
అలా మరిస్తే వారు చరిస్తే
చరిత్రహీనులై నిలిచిపోతారు
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచాడు
అడుగులకు మడుగులొత్తని
ఆదర్శవాదియై గెలిచాడు
భారత రాజ్యాంగ రచన శిల్పి
భరతమాత ఏకైక సుతుడు, హితుడు ఈతడు.
అవమానాలను ఆయుధాలుగా చేసుకున్నవాడు
అసమానతల పోరాట తత్వాన్ని పూసుకున్న ఱేడు!!!
విశ్వ జనుల హృదయాల్లో వెలుగుతున్న సూర్యుడు
అశ్వ గమన వేగంతో పోరాటం సలుపు ఆర్యుడు
మన భరతమాత ముద్దుబిడ్డ అంబేద్కర్
అతనే మన దార్శార్ యై నిలిచిన మన అందరి విక్టర్!!

- గుర్రాల లక్ష్మారెడ్డి, కల్వకుర్తి,
నాగర్ కర్నూల్ జిల్లా.

## సహనం లేని సమాజం

జీవంలేని జీవనాధారంతో
నిలకడలేని నిజాలతో, ఇజాలతోసాగిపోతోంది
నేటి సహనం లేని సమాజం .
ఓవైపు.! విచ్చలవిడితనంలోనే
విలువలు పతనమున్నాయని గ్రహించలేని యువత నెట్లో
చిక్కుకుని బంగారు భవితకు పిండం పెడుతోంది.
మరోవైపు.! క్షణం తీరిక లేని మనిషి
క్రమశిక్షణ లేని జీవనంతో..
సంరక్షణ లేని జాగాలో.,
తన మేధో వికృత చేష్టలతో.,
ప్రకృతి పవిత్రతకి కళంకమై కుళ్ళుతున్నాడు.
చివరకు.! బంధం విలువలేని సమాజం..ఆశ్రమాల్లో
సేదతీరుతూ..
తరతరాలకీ తరగని నిధిలా నిలుస్తూ..
ప్రతి మనిషీ..!ఆశ్రమవాసియేనని వెక్కిరిస్తోంది..!
ఓ మనిషీ..! ఇకనైనా కనువిప్పుతో
నిప్పులు కక్కే వాస్తవాల్ని గ్రహించు.
నీ మమతాసమతలతో...
నీ భవితకు, నవతకు ప్రగతి సౌధాన్ని నిర్మించు.!
ప్రకృతి ధర్మాన్ని ఆశ్వాదించు.!
ప్రకృతి ఒడిలో చిరకాలం జీవించు.!

- డా. పసుపులేటి నాగమల్లిక
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం.